


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 30 ఏప్రిల్ 2025 పేజీలు 8




## ప్రధాని రాక రాష్ట్రానికి

# ఒక పండుగ

- రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడాలనుకునే వారికి బుద్ధి చెప్పాలా పీఎం మోడీకి స్వాగతం చెబుదాం
- ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులతో సన్నాహక సమావేశం
- ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, చేనేత, జౌళి శాఖా మంత్రి సవిత, ఎమ్మెల్యే వసంత
- రాజధాని అమరావతి వల్ల అభివృద్ధి చెందే నియోజకవర్గాల్లో మైలవరం ఒకటి
- రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న మోడీకి స్వాగతం పలికేందుకు స్వచ్ఛందంగా తరలిరానున్న ప్రజలు
- మైలవరం నియోజకవర్గం నుంచి 50 వేలకు మించి వస్తారని అంచనా
- వారందరికీ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించిన ఎంపి కేశినేని, ఎమ్మెల్యే వసంత

7



## ప్రధాని పర్యటనకు

# పటిష్ట ఏర్పాట్లు

- మే 2న అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి రానున్న పీఎం
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రధాని పర్యటనకు పటిష్ట ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మే 2వ తేదీ అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరు కానున్న నేపథ్యంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్య కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, మిగతా 2లో...

## ప్రముఖ వైద్య కేంద్రంగా..

# మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి



- అన్ని విధాల అభివృద్ధి చేసి తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రినీ అన్ని విధాల అభివృద్ధి చేసి తీర ప్రాంతంలో ప్రముఖ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి( జి జి హెచ్)లో ఏర్పాటుచేసిన క్లినికల్ లెక్చరు గ్యాలరీని మంత్రి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రి ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగి తలపురెడ్డి శ్రీనివాసరెడ్డి తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా రోగులకు బల్లలు, స్టేచర్ ట్రాలీలు, మెడిసిన్ 2లో

## పీ4 మహాయజ్ఞంలో

# తొలిఅడుగు



- రాష్ట్రంలోనే మొదటిసారిగా ముప్పాళ్లలో బంగారు కుటుంబాలకు మార్గదర్శుల సాయం
- భవిష్యత్తుకు భరోసాతో పేదలకు తీరనున్న వెతలు
- ఈ నలుగురు మార్గదర్శుల స్ఫూర్తి నాలుగు లక్షల మందికి ఆదర్శం కావాలి
- ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ముప్పాళ్లలో పడిన అడుగులు
- ఆర్థిక చేయూతే కాదు.. పేదరికం నుంచి బయటపడేంత వరకు మార్గనిర్దేశం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

**నందిగామ, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్:** సమాజంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం ప్రారంభించిన పీ4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమంలో మరో గొప్ప ముందడుగు పడింది. రాష్ట్రంలోనే తొలిసారిగా నందిగామ నియోజకవర్గం, మిగతా 2లో...

# ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు





(మొదటిపేజీ తరువాయి)

బోండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావు, పర్యటన విధులు నిర్వహించే రూట్ ఆఫీసర్లు, లైజనింగ్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మే 2వ తేదీ అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి రానున్న దృష్ట్యా అందరి భాగస్వామ్యంతో పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన మంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని క్యాబినేట్ సబ్ కమిటి ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించి దశ దిశ నిర్దేశిస్తున్నారన్నారు. గ్రీన్‌ఫీల్డ్ రాజధాని లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో సభా వేదికకు జిల్లా నుండి బస్సు సౌకర్యం కల్పించాలని ముఖ్యంగా రైతులు, పారిశ్రామిక వేత్తలు, విద్య వైద్య వివిధ రంగాలకు చెందిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తీసుకురావాలన్నారు. వివిధ ప్రాంతాల నుండి బయలు దేరే బస్సులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నుండి సుమారు లక్ష మంది కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో తాగునీరు, ఆహారం, తదితర అవసరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణకు స్థానిక కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఏర్పాట్ల సమన్వాయానికి ప్రత్యేక అధికారులకు భాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. అధికారలు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమిష్టి భాగస్వామ్యంతో గౌరవ ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేద్దామని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ ప్రధాన మంత్రి పర్యటనకు జిల్లా నుండి చేసిన ఏర్పాట్లను మంత్రికి వివరించారు. జిల్లా నుంచి ప్రధాన కార్యక్రమ వేదికకు చేరుకునేందుకు ఉన్న మార్గాలు, వివిధ ప్రాంతాలకు ఏర్పాటు చేసిన బస్సులు, ప్రతి బస్సుకు ఏర్పాటు చేసిన ఇన్‌చార్జ్‌లు, ప్రజలకు కల్పించిన సౌకర్యాలు, వైద్య శిభిరాలు, తదితరల అంశాల మొబల్కైజేషన్ ప్రణాళికను ఇన్‌చార్జ్ మంత్రికి వివరించారు. సమన్వయ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ హెచ్. ఎం. ధ్యానచంద్ర, డిఆర్‌వో ఎం. లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్‌డివో కె. చైతన్య, తదితరులు ఉన్నారు.

# పీ4 మహాయజ్ఞంలో తొలిఅడుగు

(మొదటిపేజీ తరువాయి)




ముప్పాళ్లలో బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. కేవలం ఆర్థిక సహాయం అందించి ఊరుకోవడమే కాదు.. ఓ పేద కుటుంబాన్ని పేదరికం నుంచి పూర్తిగా బయటపడే వరకు, ఆర్థికంగా నిలదొక్కుకొని సమాజంలో సగర్వంగా నిలబడేవరకు, ఆ కుటుంబం కూడా మార్గదర్శిగా ఎదిగేందుకు మార్గదర్శులు భరోసా కల్పించే ఈ బృహత్తర కార్యక్రమంలో తొలిగా నలుగురు మార్గదర్శులు తాము దత్తత తీసుకున్న కుటుంబాలకు సహాయం అందించారు. కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య.. మార్గదర్శులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్రక్స్ బయోటెక్ ద్వారా పగడాల నాగరత్నం కుటుంబానికి, సెంటిని బయో ప్రొడక్ట్స్ ద్వారా కొండ్రు వెంకటరావమ్మ కుటుంబాలకు ఆటోలు అందజేశారు. ప్లైవుడ్ కంపెనీ ద్వారా పగడాల నాగరత్నం, కొండ్రు వెంకటరావమ్మ, ఉప్పెల్లి నాగజ్యోతి, బొబ్బా శ్రీలక్ష్మి, పగడాల ప్రియాంక, బోల్నిది శిరీషలకు కుట్టు మిషన్లు అందజేశారు. అంబా కోచ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా బంగారు కుటుంబ సభ్యులు కె.లక్ష్మయ్య, కె.రమాదేవి దంపతులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. అదేవిధంగా మరో 9 మందికి అవసరమయ్యే మందులతో మెడికల్ కిట్లు అందజేశారు.

### పేదరికం నుంచి పూర్తిగా బయటపడే వరకు చేయిపట్టి నడిపించే మిషన్ పీ4: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ చంద్రునిపై అడుగుపెట్టిన మొదటి వ్యక్తిగా గుర్తింపు సాధించిన సమయంలో నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్.. ఇక్కడ పడింది చిన్న అడుగే కావొచ్చు.. కానీ, మానవాళికి ఇది అతిపెద్ద ముందడుగు అన్నారు. ఈ రోజు ముప్పాళ్లలో నలుగురు మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలు స్వయం సమృద్ధి సాధించేందుకు చేసిన ఈ సహాయపు చిన్న అడుగు పేదల జీవితాల్లో గొప్ప వెలుగు అని, ఈ స్ఫూర్తితో మరో నాలుగు లక్షల మంది మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంఎస్‌ఎంఈలు కూడా ఈ గొప్ప కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమం ఒక్కరోజుతో అయిపోయేది కాదని.. ఎన్‌టీఆర్ జిల్లాలోని 96 వేల కుటుంబాలూ అభివృద్ధి చెందే వరకు కొనసాగుతుందని, ఆయా కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానించి, సమాజంలో ఉన్నతంగా ఎదిగే వరకు మార్గదర్శుల ద్వారా సహాయ సహకారాలు అందుతాయన్నారు. సీఎస్‌ఆర్ మాదిరి కాకుండా పీ4 అనేది ఓ వినూత్న కార్యక్రమమని.. రాష్ట్రంలోనే కాదు దేశంలోనూ, ప్రపంచంలోనూ ఎప్పుడూ ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఉదాహరణకు బంగారు కుటుంబంలో ఏడో తరగతి చదువుతున్న ఓ అమ్మాయికి డాక్టర్ కావాలనే కోరిక ఉంది. ఆ చిన్నారి డాక్టర్ కలను సాకారం చేసుకునేందుకు ఏ కాలేజీలో చేరాలి? ఏ కోర్సు చేయాలి? శిక్షణ ఎక్కడ తీసుకోవాలి? ఇలా ప్రతి విషయంలోనూ మార్గదర్శి చేయిపట్టి నడిపించే ఓ విశిష్ట కార్యక్రమం పీ4 అని వివరించారు. ఇప్పుడు మార్గదర్శులు అందించే సహాయసహకారాలు ఆసరాగా మరో నాలుగైదేళ్లలో బంగారు కుటుంబాలు కూడా మార్గదర్శులుగా ఎదగాలి.. అదే ఈ మిషన్ లక్ష్యమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మార్గదర్శులు అందించే ప్రతి రూపాయి, ప్రతి సాయం అత్యంత పారదర్శకతతో మార్గదర్శులకు వెళుతుందని, ఈ రోజు ముప్పాళ్లలో జరిగిన కార్యక్రమమే ఇందుకు నిదర్శనమని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఓ గొప్ప కార్యక్రమంలో భాగస్వాములవుతున్న మార్గదర్శకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.




### గొప్ప విజనరీ మన ముఖ్యమంత్రి: ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

గొప్ప దార్శనికత ఉన్న ముఖ్యమంత్రిగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు ఉందని, మనం రేపటి గురించి ఆలోచిస్తే ఆయన 20 సంవత్సరాల తర్వాత గురించి కూడా ఆలోచిస్తారని నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ముప్పాళ్లలో జరిగిన మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి పాల్గొన్నారని.. బంగారు కుటుంబాలను, మార్గదర్శులను ఒకేవేదికపైకి తీసుకొచ్చారన్నారు. అప్పటి నుంచి నిరంతరం కుటుంబాల స్థితిగతులను తెలుసుకొని మార్గదర్శులతో అనుసంధానించి, వారు ఆర్థికంగా, తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఈరోజు జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషానిస్తోందన్నారు. కలెక్టర్‌గారి సారథ్యంలో పీ4 కార్యక్రమం ఇలా ముందుకెళ్తుండటం చాలా ఆనందం కలిగిస్తోందన్నారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా సాయం అందించే కార్యక్రమం రాష్ట్రంలోనే తొలిసారిగా ముప్పాళ్లలో జరిగినందుకు చాలా ఆనందంగా ఉందని శాసనసభ్యులు పేర్కొన్నారు. ఇందుకు గౌరవ ముఖ్యమంత్రికి, జిల్లా అధికార యంత్రాంగానికి, మార్గదర్శులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.



ప్రముఖ వైద్య కేంద్రంగా..

# మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

(మొదటిపేజీ తరువాయి)



ట్రాలీలు మంత్రి చేతుల మీదుగా ఆసుపత్రికి అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో అతను ఏర్పాటు చేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహం మంత్రి ఆవిష్కరించి, ఉద్యానవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రి సానిటరీ వర్కర్ రవితేజ దాతగా మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంత్రి చేతుల మీదుగా బల్లలు ఆసుపత్రికి అందజేశారు. నైటింగేల్ విగ్రహం, రోగులకు బల్లలు ట్రాలీలు అందజేసిన దాత శ్రీనివాసులు రెడ్డిని ఈ సందర్భంగా మంత్రి ఘనంగా సత్కరించారు. తదనంతరం మంత్రి మాట్లాడుతూ వైద్యం అంటేనే సేవ అని ఫ్లోరెన్స్ నైటింగేల్ తన జీవితాన్ని వైద్య సేవలకు అంకితం చేశారని, అనేక మందికి సేవలు చేసి స్ఫూర్తినిచ్చిన మానవతా మూర్తి అని కొనియాడారు. జిల్లా ఆసుపత్రికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని బ్రిటిష్ కాలం నుండి మంచి పేరు పొందిన ఆసుపత్రి అన్నారు.నర్సింగ్ కళాశాల కూడా ఇందులో ఉందని 200 మంది దాకా నర్సింగ్ విద్యార్థులు ఉన్నారని వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నర్సింగ్ కళాశాలకు నిధులు సమకూర్చి త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.మొన్న ఆరోగ్య శాఖ కార్యదర్శి తో మాట్లాడానని త్వరలో సమావేశం నిర్వహించి పురోగతి సాధిస్తామన్నారు. ఈ జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉందన్నారు. మరిన్ని నిధులు సమకూర్చి అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి పరిచి తీర ప్రాంతంలో ప్రముఖ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దామన్నారు ప్రస్తుతం క్యాజువాలిటీలో కొందరు డాక్టర్ల కొరత ఉందని ఆరోగ్య శాఖ మంత్రి తో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి ఆశాలత, నర్సింగ్ సూపరింటెండెంట్ డా. ఆశా సజన, ఆర్ ఎం ఓ డాక్టర్ నిరంజన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజా రమణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, కార్పోరేటర్ అనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పలువురు నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో 3రెట్ల వృద్ధి సాధించిన టాటా ఏఐజీ



**అంతగా సేవలందని మార్కెట్ల కోసం మెడికేర్ సెలెక్ట్ ఆవిష్కరణ**

**1600 ప్లస్ ఆసుపత్రులతో ప్రాంతీయంగా పటిష్టమైన నెట్వర్క్**

**2025 ఆర్థిక సంవత్సరంలో రెండు రాష్ట్రాల్లో 97% క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తి**

**14,500 మంది అడ్వైజర్లు, వారి కుటుంబాలకు విస్తృత ఆదాయ అవకాశాలు**

**విజయవాడ మేజర్ న్యూస్ :** గత ఏడాది వ్యవధిలో 82,000 పైచిలుకు పాలసీదారులకు కవరేజీని అందించడం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తమ రిటైల్ హెల్త్ పోర్ట్ఫోలియోలో 3రెట్ల వృద్ధి సాధించినట్లు భారత్లో అగ్రగామి జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వెల్లడించింది. జాతీయ సగటు కన్నా ఆరోగ్య బీమా విస్తృతి తక్కువగా ఉంటున్న దక్షిణాది మార్కెట్లలో విశ్వసనీయమైన బీమా సాధనాలకు పెరుగుతున్న డిమాండ్కి ఈ వృద్ధి నిదర్శనంగా నిలుస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని 51 జిల్లాల్లో కంపెనీ తన కార్యకలాపాలను పటిష్టం చేసుకుంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, కరీంనగర్, నెల్లూరులో కీలక శాఖలను ఏర్పాటు చేసింది. టాటా ఏఐజీ నెట్వర్క్, 1,600 పైగా ఆసుపత్రులు, 14,500 అడ్వైజర్లతో సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, బీమా సేవలను మరింత అందుబాటులోకి తీసుకొచ్చి, జీవనోపాధి అవకాశాలను కూడా సృష్టిస్తోంది.వైద్య బీమా సేవల లభ్యతను మరింతగా పెంచే దిశగా కంపెనీ కొత్తగా మెడికేర్ సెలెక్ట్ పేరిట, మారుతున్న కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఉండే సరళతరమైన, తక్కువ వ్యయాలతో కూడుకున్న హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జాతీయ స్థాయిలో సగటున వైద్యచికిత్సల ద్రవ్యోల్బణం 13 శాతం స్థాయిలో ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో 16 శాతానికి పెరిగిన నేపథ్యంలో ఈ పెను సవాలును అధిగమించేందుకు, కస్టమర్లకు కీలక పరిష్కారాన్ని అందించేందుకు ఈ సాధనం తోడ్పడగలదు. నవజాత శిశువుల నుంచి సీనియర్ల వరకు, ఎటువంటి వయోపరిమితి లేకుండా అన్ని వర్గాల కస్టమర్లకు అనువైనదిగా, అందుబాటు ప్రీమియంలతో ఉండేలా మెడికేర్ సెలెక్ట్ రూపొందించబ డింది. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకోతగిన విధంగా ఇది ఉంటుంది. జీవితకాల యంగ్ ఫ్యామిలీ డిస్కౌంట్, 7.5% శాలరీ డిస్కౌంట్లాంటి ఉపయుక్తమైన ఫీచర్ల కారణంగా అన్ని రకాల ఆదాయవర్గాల వారు, జీవితంలో వివిధ దశల్లో ఉన్న వారికి ఇది అనువైనదిగా ఉంటుంది.గడిచిన మూడేళ్లుగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో క్యాన్సర్ చికిత్స కోసం ఆసుపత్రిలో చేరే ఉదంతాలు అగ్రస్థానంలో ఉంటున్నాయి. ఖర్చులు 25 శాతం పెరగ్గా, సగటు ట్రీట్మెంట్ వ్యయాలు రూ. 1.6 లక్షలకు చేరాయి.



## ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అమరావతి నిర్మాణం రాష్ట్ర ప్రగతికి సోపానం అని, మే2న జరిగే మోడీ సభను విజయవంతం చేయాలని టీడీపీ అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ మండల పార్టీ కార్యాలయంలో చిట్టిబాబు మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి శ్రీకారం చుడుతోందన్నారు. మే 2 వ తేదీ శుక్రవారం అమరావతిలో జరిగే ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం బాబూరావు, పార్టీ నాయకులు విశ్వనాధుని మురళీ మోహన్, అడపా వెంకటేశ్వరరావు, పులగోరు రాజేంద్ర, లుక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రాంగణ నియామకాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్థానిక గుడ్లవల్లేరులోని వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల యందు ఒమేగా హెల్త్ కేర్, చెన్నై వారు బీఫార్మసీ నాలుగో సంవత్సరపు విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ నియామకాలను రెండు దశలలో నిర్వహించారు. మొత్తం 47 మంది. విద్యార్థులు పాల్గొనగా మొదటి దశలో నిర్వహించిన రాత పరీక్షలో 35 మంది విద్యార్థులు అర్హత పొందగా రెండవ దశలో నిర్వహించిన టెక్నికల్ అండ్ పర్సనల్ ఇంటర్వ్యూలో ఎనిమిది మంది ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఉద్యోగం సాధించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. ఈ 8 మంది విద్యార్థులు ట్రైనీ మెడికల్ కోడరుగా బెంగళూరులో చేరనున్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు డాక్టర్ ఎస్ కే అమీనాభి, డాక్టర్ పి రవిష, డాక్టర్ టి ప్రశాంతి, డాక్టర్ టి బాలకృష్ణ, బి సత్య శ్రీ, టి శ్రావణి, వి ఎల్ వినోద్ కుమార్, డాక్టర్ ఏ సాయిదాత్రి, కే పరిమళ, డాక్టర్ వి రజని తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ప్రతినిధి ఎస్కే నాగుల్ మీరావలికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పవన్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రాయపూడి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన జనసైనికుడు మధుసూదన్ రావుకు జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 50 లక్షలు హార్దిక సహాయం ప్రకటించడం అభినందనీయమని ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ మూల సిద్ధాంతం కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉందాం అన్యాయం జరిగితే ప్రశ్నిద్దాం అనే నినాదంతో ఏర్పడిన జనసేన పార్టీ సిద్ధాంతాన్ని జనసేన పార్టీ అధ్యక్షులు తూచా తప్పకుండా పాటించడం జనసైనికులకు అందరికీ గర్వకారణంగా ఉందన్నారు కాశ్మీర్లో తీవ్రవాదుల చేతులలో మరణించిన కుటుంబానికి అండగా నిలిచి దేశంలో ఇటువంటి చర్యలను క్షమించేది లేదని, ఇలాంటి చర్యలకు పాల్పడిన తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలని భారత్ ప్రభుత్వాన్ని కోరారు.

## దివంగత నేత కాగిత వెంకట్రావుకు ఘననివాళి



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** దివంగత నేత మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్, టీటీడీ చైర్మన్ కాగిత వెంకట్రావు నాలుగో వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కాగిత వెంకట్రావు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. కాగిత వెంకట్రావు భౌతికంగా లేకపోయినా వారి జ్ఞాపకాలు తమ మదిలో స్థిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అనంతరం నాగేశ్వరరావుపేట రోడ్డు సమీపంలో ఆయన తనయుడు ప్రస్తుతం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ బొర్రా కాశీ విశ్వేశ్వరరావు మండల అధ్యక్షులు కోనపురెడ్డి వీరబాబు, గుడిసేవ శ్రీరామచంద్ర మూర్తి, వర్ణం హరిబాబు, భూపతి రమేష్, ఎస్సీ నాయకులు ఆకునూరి రత్నకుమార్, ఎం.డీ. నజీర్ జొన్నలగడ్డ కొండలరావు, సన్నాల ప్రసాద్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.






## క్వాలిటీ వాల్ కొత్త ఐస్ క్రీమ్ బ్రాండ్, డెయిరీ ఫ్యాక్టరీ ప్రారంభం

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రముఖ లెగసీ బ్రాండ్ క్వాలిటీ వాల్ ది డైరీ ఫ్యాక్టరీని ప్రారంభించింది. ఈ సందర్భంగా హుల్ ఐస్ క్రీమ్ బిజినెస్ హెడ్ టోలోయ్ తన్నిడాగ్లీ మాట్లాడుతూ,ఇది ఇంట్లో ఐస్ క్రీం అనుభవాన్ని పెంచడానికి నెమ్మదిగా కోరిన ఐస్ క్రీముల శ్రేణి అన్నారు. పాడి ఫ్యాక్టరీ అనేది నిజమైన పాడితో తయారు చేసిన ఐస్ క్రీమ్ల యొక్క అల్ట్రా క్రీమీ లైన్ అని, వనిల్లా, బటర్స్కోచ్, మామిడి, చాక్లెట్ అనే నాలుగు ప్రసిద్ధ వేరియంట్లలో లభిస్తుందన్నారు. సమీప దుకాణాలు, శీఘ్ర వాణిజ్య ప్లాట్ఫారమ్ల నుండి ఎప్పుడైనా ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. క్వాలిటీ వాల్తరతరాలుగా, హస్తకళా ఐస్ క్రీం యొక్క గ్యాస్ట్రోనమిక్ ఆనందాల పట్ల ప్రజలు ఆకర్షితులయ్యారని, శిల్పకళా నైపుణ్యం అసాధారణమైన రుచుల సింఫొనీతో, పాడి కర్మాగారం నెమ్మదిగా చర్నింగ్ యొక్క పాండిత్యాన్ని జరుపుకుంటుందన్నారు.తాజా పాలతో చిన్న బ్యాచ్లతో తయారు చేయబడిన 100 శాతం ఐస్ క్రీం యొక్క చలికాలంలో క్రీము రేఖలోకి, ఔత్సాహికులు ఇప్పుడు హౌస్ ఆఫ్ క్వాలిటీ వాల్ నుండి టైంలెస్ డెజర్ట్ యొక్క ఆనందంలో ఆనందించవచ్చు అన్నారు.ప్రియమైన క్లాసిక్ ఫ్లేవర్ ప్రొఫైల్లతో ప్రారంభించి, ఇంటికి సమీపంలో ఉన్న క్వాలిటీ వాల్ యొక్క రిఫ్రిజిరేటర్లో పాడి కర్మాగారం దేశవ్యాప్తంగా లభిస్తుందని చెప్పారు.

## డిప్యూటీ సీఎం పవన్.. చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి



**ఉగ్రదాడినీ అరికట్టడానికి కేంద్రం కృషి చేయాలి**

**ఏపీ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్**

**విజయవాడ మేజర్ న్యూస్ :** కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడి అనేది ఒక బాధాకరం ఘటన అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ విజయవాడలో తన కార్యాలయం నుండి ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం యూనియన్ టెరిటరీలో భాగం అయ్యి ఉండి, సర్వెలెన్స్ ఫెయిల్యూర్ సెంట్రల్ గవర్నమెంట్ ది, పోలీస్ కూడా సెంట్రల్ గవర్నమెంట్ చేతుల్లో ఉంటుందన్నారు. ఈ ఘటన జరగక ముందు స్థానికంగా ఉన్న బీజేపీ నేత ఇంట్లో పెళ్లి కార్యక్రమాల్లో పోలీస్ యంత్రాంగం ఉందని, దాడి జరుగుతున్న చాలా సేపటికీ కూడా భద్రత బలగాలు అక్కడికి రాకపోవడంతోనే మరణాలు ఎక్కువగా సంభ వించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫెయిల్యూర్ మీద ఫెయిల్యూర్ తోనే ఈ ఘటన జరిగిందన్నారు. టెరరిజంకి మతం లేదన్నారు. నేడు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్కి అవగాహన లేకుండా విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు? బీజేపీ పార్టీ స్క్రిప్ట నే పవన్ కల్యాణ్ చదువుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ను విమర్శించేముందు మిగతా నాలుగు వేళ్లు కూడా, బీజేపీకే చూపిస్తున్నాయన్న విషయం పవన్ కళ్యాణ్ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఒక పేరు చెప్తే పాకిస్థాన్ కి లాగులు తడుస్తాయ్ అంటే ఆ పేరు భారత దేశ మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాం ధీనే అని అన్నారు. మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఈనాటి తరం కొన్ని పార్టీలకు, నాయకులకు దేశ చరిత్ర మీద అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. పవన్ కళ్యాణ్ ప్రస్తు తం రాష్ట్ర డిప్యూటీ సీఎం అని, అతను చరిత్రను తెలుసుకొని మాట్లాడాలి కానీ, ఎవరినో మెప్పించడానికి కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేయొద్దనీ హితవు పలికారు.

## డాక్టర్ విజయ్ను సన్మానించిన పంచాయతీ సిబ్బంది



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ గ్రామ సర్పంచ్, ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన డాక్టర్ దాసరి విజయ్ ను పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విజయ్ కు సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ సోమవారం ప్రధానం చేసిన సందర్భంగా మంగళవారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి అనిత, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.



## మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా

### చింతకోళ్ల, హంసలదీవి, రామకృష్ణాపురం, పాదాలవారి పాలెం గ్రామాలకు తాగునీరు అందించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్







**కోడూరు మేజర్ న్యూస్:** వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో తీర గ్రామాల దాహం తీర్చేందుకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఉచిత తాగునీరు సరఫరా చేశారు. ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా మంగళవారం కోడూరు మండలం చింతకోళ్ల, హంసలదీవి గ్రామాలకు తాగునీరు అందచేశారు. సోమవారం రామకృష్ణాపురం, పాదాలవారిపాలెం గ్రామాల ప్రజలకు తాగునీరు సరఫరా చేశారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, తన తండ్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు మండలి ఫౌండేషన్ జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలి ఫౌండేషన్ ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.

## నెట్టెం రఘురాంకు టీడీపీ శ్రేణుల అభినందనలు



**నందిగామ, ఏప్రిల్ 28, మేజర్ న్యూస్:** కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ గా విజయవాడ పార్లమెంట్ జిల్లా టిడిపి అధ్యక్షుడు నిత్యం రఘురాం నియామకం పట్ల నందిగామ మండలంలోని టిడిపి శ్రేణుల ఆనందం తో హర్ష వ్యక్తపరిచారు.,నెట్టెం రఘురాం జిల్లా దిశా కమిటీ సభ్యురాలు మన్నే కళావతి, టిడిపి ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, తొర్రగుడు పాడు సర్పంచ్ చెరుకూరు హైమారావ్, టిడిపి నాయకులు చంద్రా శ్రీనివాసరావు పలు గ్రామాల టిడిపి నాయకులు కలసి పుష్పకచంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి, క్రమశిక్షణ,పార్టీ ఉన్నతికి, రాజకీయ అనుభవం వివాదరహితుడు కావటం వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులు తో నాయుడు నెట్టెం రఘురాంకు ఈ పదవి రావడం పట్ల పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సవాలు నెలకొన్నాయి.

## శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు



**నందిగామ, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్:** పట్టణంలోని 14వ వార్డు నెహ్రూ నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకు లతో కలసి పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులందరికి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ఆలయ కమిటీ వారు డాక్టర్ జగన్మోహనరావుని సత్కరించారు.

# ప్రధాని పర్యటన విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలి



### తూర్పు నుంచి 20 వేల మందికిపైగా హాజరుకావడానికి సిద్ధంగా ఉన్నారు

### తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు

**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** మే 2వ తేది అమరావతికి వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడి పర్యటన విజయవంతం చేయడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గం నుంచి 20 వేల మందికిపైగా ప్రజలు తరలిరానున్నారని ఆయన చెప్పారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకుడు చెన్నుపాటి గాంధీ నివాసంలో మే 2వ తేదిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడి పర్యటన విజయవంతానికి చేయాల్సిన ఏర్పాట్ల గురించి తూర్పు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజుతో పాటుగా టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎనలేని సమయాన్ని అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడి అమరావతికి వస్తున్న సందర్భంగా ప్రజలందరూ ఘన స్వాగతం పలకడానికి సిద్దంగా ఉన్నారన్నారు. తూర్పు నియోజకవర్గం నుంచి 20 వేల మందికిపైగా మోడి సభకు రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మోడికి ఘనస్వాగతం పలకాలని, ఆయన మాటలను వినాలని చాలా మంది స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. ఇంకా నాలుగు సంవత్సరాలు మోడి మన రాష్ట్రానికి సహాయం చేయాలని అన్నారు. ప్రధాన మంత్రి మోడి పర్యటన సక్సెస్ చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డివిజన్ నుంచి వచ్చే వారిని ఏవిధంగా సభ ప్రాంగణానికి తీసుకువెళ్లాలి అక్కడ ఏర్పాట్ల గురించి పూర్తి స్తాయిలో చర్చించామన్నారు. ప్రధాన మంత్రి మోడి అమరావతి పర్యటనలో కూటమి పార్టీలోని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ అమరావతిలో సుమారు లక్ష కోట్ల రూపాయలతో చేపట్టనున్న పలు ప్రాజెక్టుల శంకుస్థాపనకు వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడికి ఘన స్వాగతం పలకాలన్నారు. తూర్పు నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంద్రేశ్వరి కూడా మోడి పర్యటన విజయవంతంగానికి కృషి చేస్తున్నారని చెప్పారు. అమరావతికి దగ్గర ఉన్న విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా మోడి సభకు వచ్చి విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని రామరాజు చెప్పారు. ఈ సమావేశంలో చెన్నుపాటి గాంధీ, షేక్ ఫిరోజ్, పోట్లూరి సాయిబాబు, సొంగ సంజయ్ వర్మ, గౌరిపర్తి నామేశ్వర రావు, గుమ్మడి గురు ప్రసాద్,పేరేపి ఈశ్వర్, మదాల రాజ్యలక్ష్మి, దోమకొండ రవి, పఠాన్ హయత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మహతి కవి భూషణ ముక్కా సత్యనారాయణ

### హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా సన్మానం



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలుకు చెందిన ఉపాధ్యాయ రచయిత ముక్కా సత్యనారాయణను మరో బిరుదు పురస్కారం వరిచింది. సోమవారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో పద్మశ్రీ ఆచార్య కొనకలూరి ఇనాక్, జానపద కళల మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ, స్వర్ణనంది గ్రహీత సాదనాల వెంకటస్వామి నాయుడు చేతుల మీదుగా సత్యనారాయణను మహతి కవి భూషణ బిరుదుతో ఘనంగా సన్మానించారు. మహతి సాహితీ కవిసంగమం వారి ఐదవ వార్షికోత్సవ సందర్భంగా వివిధ ప్రక్రియలో తొమ్మిది వేల పైగా రచనలు చేసిన ముక్కా.సత్యనారాయణను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు అడిగొప్పుల సదయ్య అధ్వర్యంలో పొర్ల వేణుగోపాలరావు, వైరాగ్యం ప్రభాకర్, గీతా శైలజ, డి ఎస్ వి మహాలక్ష్మి, విటిఆర్ మోహనరావు, చంద్రమౌళి, యనమండ్ర వరలక్ష్మి తదితరులు అభినందించారు. మొత్తం పన్నెండు పుస్తకాలు ఈ కార్యక్రమంలో ఆవిష్కరణ చేయబడగా నలుగురు రచయితలు తమ పుస్తకానికి ముందు మాట రాసిన ముక్కా సత్యనారాయణను ప్రత్యేకంగా సన్మానించారు. విజయవాడ రూరల్ ఎంఈఓ అజ్మీర్ సూరిబాబు, డి పి ఆర్ టి యు నాయకులు వేగినేటి వెంకటరమణ, రామ్మూర్తి మాస్టారులు సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

# బాల్య వివాహాలపై అవగాహన సదస్సు





**నందిగామ, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్:** పట్టణం లోని ఎంపీడీఓ ఆఫీస్‌లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారు, వాసవ్య మహిళ మండలి సంయుక్తంగా నందిగామ నియోజకవర్గం లో ఉన్న చర్చి పాస్టర్లు, పురోహితులు, మైనారిటీ ఖాజిస్, మహిళ సంరక్షణ కార్యదర్శులకు అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 30న అక్షయ తృతీయ కాబట్టి ఆరోజున ఎక్కువగా మ్యారేజ్ లు జరుగుతాయి కావున బాల్య వివాహాలు జరగకుండా చర్చి పాస్టర్లు, పురోహితులు, మైనారిటీ ఖాజీలు చూడాలని పేర్కొన్నారు. బాల్య వివాహల వల్లన ఎర్లీ ప్రెగ్నెన్సీ వస్తుంది దాని వల్లన ఆరోగ్య సమస్యలు వస్తాయి. కాబట్టి బాలికలకు 18 సం.లు, బాలురులకు 21 సం.లు నిండిన తరువాత మ్యారేజ్ లు చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా కిశోరి బాలలకు మే నెల 2 నుండి జూన్ 10 వరకు ప్రత్యేకమైన క్యాలెండర్ ద్వారా బాల్య వివాహాలు, పోక్స్, ఋతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాము. జిల్లా బాలల పరిరక్షణ అధికారి యమ్. రాజేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలను నిషేదించటంలో అందరు బాధ్యత కలిగి ఉండాలని పేర్కొన్నారు. నందిగామ ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటలు నిర్వహించలని పేర్కొన్నారు. ఏసీడీపీఓ కృష్ణ కుమారి మాట్లాడుతూ గ్రామాలలో బాల్య వివాహాలు నిషేదించటంలో అధికారులు సహకరించలని కోరారు. కే కిరణ్‌కు మార్ పోక్స్ చట్టంపై అవగాహన కల్పించారు. చందర్లపాడు ఎంపీడీఓ నాంచారయ్య మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా అన్ని మతలవారు చూడాలని పేర్కొన్నారు. వాసవ్య మహిళ మండలి జిల్లా కోఆర్డినేటర్ హృదయ రాజు బాల్య వివాహలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో పాస్టర్ల వెల్ఫేర్ అధ్యక్షులు పాస్టర్ డేవిడ్, దేవాదాయ శాఖ ఈఓ రవీంద్ర బాబు, గవర్నమెంట్ ఖాజీలు ఖలీల్ అహ్మద్ రజ్వి, పెద్ద మసీదు ముత్తవలి మహమ్మద్ ఖాజా మొహిద్దిన్,, జాన్ వెస్లీ, సూపెర్వైసర్లు కరుణ కుమారి, వెంకటరమణ, ఇషరత్, కరీమా, శ్రీదేవి, శ్రీలత, ప్రభావతి, తారభి, వెంకటేశ్వర్లు, మహిళ సంరక్షణ కార్యదర్శులు తదితరుల హాజరయ్యారు.

# పేదరిక నిర్మూలన చేయడమే కూటమి లక్ష్యం







**పిఫోర్ పూర్ టు పావర్టీ ముఖ్య ఉద్దేశం పేదరిక నిర్మూలన.**

**రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నాటి నుంచి ఈనాటి వరకు పిఫోర్ కార్యక్రమం**

**సహాయ సహకారాలు అందించిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశా కి, జిల్లా అధికార యంత్రాంగానికి కూటమినేతలకు అభినందనలు.**

**ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**చందర్లపాడు, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్:** మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో మంగళవారంజిల్లా కలెక్టర్ లక్ష్మీశా అధికారులు, కూటమినేతలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల ముప్పాళ్ళ గ్రామ పర్యటనలో భాగంగా పిఫోర్ కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకాల సహకారంతో ఇచ్చిన హామీ ప్రకారం కుటుంబ పోషణ కొరకు ఆటో కుట్టుమిషన్లు ఎంప్లాయిమెంట్ కార్డ్ మెడికల్ కిట్లు, ఇంటి స్థలమును లబ్ధిదారులకు ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలనతో దూసుకుపోతోందని అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పాలన కొనసాగుతోందని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ముందుకు వచ్చిన మార్గదర్శకులకు హృదయపూర్వక పాదాభివందనాలు మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవన ఉపాధి నిమిత్తం ఈరోజు ఇంతటి మహత్ కార్యక్రమాన్ని నిర్వహించుకొనడం చాలా సంతోషం. మార్గదర్శకులు క్రక్స్ బయోటెక్, సేంతిని బయో ప్రొడక్ట్స్ వారు బంగారు కుటుంబాలైన పగడాల నాగరత్నమ్మ భర్త తంబి, కొండ్రు వెంకటరవమ్మ భర్త వెంకటేశ్వర్లులకు ఆటోలను అందించారు. కొండ్రు వెంకటరావుమ్మకి నివాసము కొరకు 0.03 సెంట్ల ఇంటి పట్టాను అందజేయడం జరిగినది. మహిళల జీవనోపాధికి ఎంతో వెసులుబాటుగా ఉండే కుట్టు మిషన్ (జిగ్ జాగ్ మిషన్ మోటారుతో) లను పగడాల నాగరత్నమ్మ, కొండ్రు వెంకటరావమ్మ, ఉప్పెల్లి నాగజ్యోతి, బొబ్బ శ్రీలక్ష్మి, పగడాల ప్రియాంక, బోలీనిడి శిరీష లకు అందజేశారు.

యువత ఉపాధికై వారికి మార్గదర్శకులు ఈ అనురాధ అంబా కోచ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు కే లక్ష్మయ్య తండ్రి పెద్ద కొండలు, రమాదేవి భర్త లక్ష్మయ్యకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అలానే ఆరోగ్య అవసరాల నిమిత్తము కోటా పుష్పమ్మ భర్త శ్రీహరి, దాచేపల్లి కాలిమ్మ భర్త భద్రయ్య, జమ్ముల అనంతరామయ్య తండ్రి చౌదరయ్య, నల్లాని అప్పమ్మ భర్త నరసింహయ్య, నల్లని సావిత్రి భర్త కోటేశ్వరరావు, నల్లని వెంకాయమ్మ భర్త సుబ్బారావు, రావూరి సీతారావమ్మ భర్త వెంకటేశ్వర్లు, రాయల వీరమ్మ భర్త పుల్లయ్య, చెరుకూరి ఈశ్వరమ్మ భర్త నాగేశ్వరరావు లకు మెడికల్ కిట్లను అందజేశారు. చెప్పిన మాట చెప్పినట్లుగా నెరవేర్చడమే కూటమి లక్ష్యమని అందుకు ప్రత్యక్ష నిదర్శనమే ఈరోజు మార్గదర్శకుల ద్వారా బంగారు కుటుంబాలకు అందజేసిన ఈ విలువైన గృహపకరణాలు జీవనోపాధి నిమిత్తం ఆటోలు కుట్టుమిషన్లు మెడికల్ కిట్లు ఎంప్లాయిమెంట్ కార్డులని తంగిరాల సౌమ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు, వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరువనంతపురం కార్పొరేషన్‌ని సందర్శించిన కార్పొరేటర్లు





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** దక్షిణాది రాష్ట్రాలకు విజ్ఞాన యాత్రకు బయలుదేరిన విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేటర్ల బృందం, కేరళ రాజధాని తిరువనంతపురం లోని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్లను, మంగళవారం ఉదయం సందర్శించారు. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పీ.కే రాజు, విజయవాడ నగర డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ రెడ్డి, టూర్ కోఆర్డినేటర్, ఫ్లోర్కా లీడర్ వెంకట సత్య నారాయణ, కార్పొరేటర్లకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తిరువనంతపురం డిప్యూటీ మేయర్ పి.కె.రాజు మాట్లాడుతూ తిరువనంతపురంలో 100 డివిజన్లు, 25 జోన్లు కలిగి ఉన్నదని, తిరువనంతపురం రాష్ట్ర రాజధాని కావడంతో వారికి వ్యర్థ పదార్థాల నిర్వహణకు పెద్ద స్థలం లేకపోవడంతో, ఉన్న చిన్న స్థలాలలోనే గత పదార్థాల నిర్వహణ చేస్తున్నారని తెలిపారు. 70 వ్యర్థాల నుండి ఎరుగును చేత తయారు చేసే ప్లాంట్లు 70 ప్రాంతాల్లో ఉన్నాయని, నగరంలో 64,430 మూడు లేయర్ల బిన్లు 64, 430 కుటుంబాలకు పంపిణీ చేశారని, 87,000 కుటుంబాలు పైప్ కంపోస్ట్ పద్ధతి ద్వారా ఎరువు ను తయారు చేస్తున్నారని తెలిపారు. తదుపరి కార్పొరేటర్లు అందరినీ ఫీల్డ్ విసిట్లో వారు వ్యర్థాల నుండి తయారు చేస్తున్న ఎరుపు పద్ధతిని చూపారు.



## బండిరామకృష్ణకు ఘన స్వాగతం జనసేన నాయకులు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా నియమించబడిన సందర్భాన్ని పురస్కరించుకొని ఢిల్లీ నుండి బయలుదేరి గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న బండి రామకృష్ణకు మచిలీపట్నం జనసేన పార్టీ శ్రేణులు రామకృష్ణ అభిమానులు వీర మహిళలు కూటమి నాయకులు మచిలీపట్నం నుండి కార్లపై ర్యాలీగా గన్నవరం చేరుకుని తమ నాయకునికి ఘన స్వాగతం పలుకుతూ గజమాలతో సత్కరించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఎదురొచ్చి స్వాగతం పలికిన ప్రతి ఒక్కరిని పేరుపేరున బండి రామకృష్ణ ఆత్మీయంగా పలకరించి ధన్యవాదాలు తెలిపారు.

## కెయూలో ప్రాంగణ ఎంపికలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** క్యూ ఐ ఎస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఒంగోలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఆరుగురు విద్యార్థుల ఎంపిక అయ్యారు. మంగళవారం కృష్ణా విశ్వవిద్యాలయం లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం,గణిత శాస్త్ర విభాగ విద్యార్థులు విభాగ విద్యార్థులు హాజరు కాగా ఆరుగురు ఎంపిక అయ్యారు. తొలుత ప్రాంగణ ఎంపీకల కార్యక్రమాన్ని రెక్టర్ ఆచార్య ఎంవి.బసవేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రాంగణ ఎంపికల కోసం పేరుగాంచిన సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీన్ ఆచార్య వైకె సుందర కృష్ణ, ప్లేస్మెంట్ విభాగం సమన్వయకర్త డాక్టర్ కిషోర్, డా.కిశోర్ పాల్గొన్నారు.

# మాది సైద్ధాంతిక పోరాటం.. మీది స్వార్ధచింతన ఆరాటం..

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై**

**సీడబ్ల్యూసీ మెంబర్ గిడుగు రుద్రరాజు ఆగ్రహం**



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎవరితో ఎప్పుడు పొత్తు పెట్టుకుంటారో.. ఎందుకు విడిపోతారో తెలియని కొంతమంది నాయకులు కమ్యూనిజం భావజాలంతో కొంతకాలం, ఇంకో సిద్ధాంతంతో ఇంకొంత కాలం.. ఇటువంటి సిద్ధాంతాలను తరచుగా మారుస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్న పవన్‌కళ్యాణ్ వంటి నాయకుల మాటలు పట్టించుకునే ఓపిక, తీరిక కాంగ్రెస్ పార్టీకి లేదని సీడబ్ల్యూసీ మెంబర్, ఏపిసీసీ పూర్వ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. పాకిస్థాన్‌పై ప్రేమ ఉంటే భారతదేశం వదిలి వెళ్లండి అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెహల్గామ్‌లో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన అమానవీయ దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని మొట్టమొదట ఖండించింది కాంగ్రెస్ పార్టీనే అని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, యువనేత రాహుల్‌గాంధీలు సీడబ్ల్యూసీ సమావేశంలో ప్రభుత్వం చేపట్టే చర్యలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ దేశం గురించి ఆలోచిస్తుంది తప్ప మతాలు గురించి కాదన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ గతంలో ఎంతోమంది నాయకులను, స్వయంగా పవన్‌కళ్యాణ్ సోదరుడు చిరంజీవిని సైతం రాజకీయ అవసరాలకు వాడుకుని వదిలేసిందని గుర్తుచేశారు. నిన్నమొన్నటి వరకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని సైతం తమ రాజకీయ అవసరాలకు వాడుకుని వదిలేసిన విషయం పవన్‌కళ్యాణ్ మర్చిపోరాదన్నారు. భవిష్యత్తులో పవన్‌కళ్యాణ్‌ను కూడా వివిధ రాష్ట్రాల్లో తమ పార్టీ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు వాడుకుని వదిలేస్తుందనే విషయం పవన్‌కళ్యాణ్ ఎంత త్వరగా గుర్తిస్తే ఆయన రాజకీయ భవిష్యత్తుకు అంత మంచిదన్నారు. కాంగ్రెస్ పార్టీ మతపరమైన రాజకీయాలతో దూరంగా ఉంటుందని సెక్యులర్ భావజాలానికి సిసలైన సెక్యులర్ పార్టీగా దేశ ప్రజలు గుర్తించి ఐదు దశాబ్దాల పాటు అధికారాన్ని కట్టబెట్టారని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో ఉండాలని ఆ దిశగా పవన్‌కళ్యాణ్ దృష్టి సారిస్తే మంచిదని గిడుగు రుద్రరాజు హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం వంటి సమస్యలు ఎన్నో ఉండగా ఇటువంటి అప్రస్తుత వ్యాఖ్యలు చేయడం ఉపముఖ్యమంత్రి హోదాకు తగదన్నారు. ఇదే నాయకుడు గతంలో అదే బీజేపిని ప్రత్యేక హోదా అంశంలో హోదాకు బదులు ప్యాకేజీ ఇచ్చిన సందర్భంలో పాచిపోయిన లడ్డూలు ఇచ్చారంటూ దూషించిన ఆనాటి తెగువ నేటి పవన్‌కళ్యాణ్‌లో కనిపించడం లేదన్నారు.



## శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణంలో విప్ సౌమ్య

**నందిగామ, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్:** పట్టణంలోని నెహ్రూ నగర్ ఆర్చిలో శ్రీదేని భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ స్వామి వారి కళ్యాణం లో దేవాలయ పాలకవర్గం, భక్తులు,, కూటమి నేతలతో కలిసి పాల్గొన్న ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ శ్రీనివాసుడు పద్మావతితో తన వివాహానికి దేవతల అనుమతి కోరాడు. వివాహ ఖర్చుల కోసం సంపదకు అధిపతి కుబేరుడి నుండి దేవుడు పెద్ద మొత్తంలో రుణం తీసుకున్నారని పురాణాలలో పొందుపరచి ఉన్నదని వెంకటేశ్వరుడు మంచితనానికి ప్రతీక అని అంటారు. అతని చక్రం చెడును నాశనం చేస్తుందని నమ్ముతారు, అయితే శంఖం ప్రపంచ అజ్ఞానాన్ని అంతం చేసే విశ్వ ధ్వనిని ఉత్పత్తి చేస్తుందని భావించబడుతుందని గుర్తు చేసారు. వేద పండిత పురోహితులు తంగిరాల సౌమ్య గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆశీర్వాదాలు అందించారు.

## ఘనంగా నూతన సిఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం



**చందర్లపాడు, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్:** మండలంలోని ఏటూరు గ్రామంలో మంగళవారం నూతన సిఎస్ఐ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు సంఘస్తులు క్రైస్తవ సోదర సోదరీమణులు, కూటమినేతలతో కలసి పాల్గొన్న ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు ఉన్న నరసింహారావు, వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రాజమౌళిని పరామర్శించిన విప్ యార్లగడ్డ



**గన్నవరం, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్ :** సోదరి భర్త మరణంతో విషా దంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి, అడుసుమిల్లి రాజమౌళిని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరామర్శించారు. రాజమౌళి బావ ఆలపాటి వెంకటేశ్వర్లు అనారోగ్యం తో ఈనెల 18న తుదిశ్వాస విడిచారు. వెంకటేశ్వర్లు పెద్దకర్మ, వైకుంఠ సమారాధన కార్యక్రమం ఉంగుటూరు మండలం, ఆత్కూరు గ్రామంలో సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరు కావలసిన యార్లగడ్డ సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్లో మంత్రులతో సమీక్షలో పాల్గొనడంతో సమయ భావం వల్ల రాలేకపోయారు. సోమవారం రాత్రి రాజమౌళి నివాసానికి వచ్చిన ఆయన వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమౌళిని, కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్, గ్రామ టిడిపి అధ్యక్షులు అట్లూరి రామ్ కిరణ్, కార్యదర్శి దారం విజయ్, టిడిపి నాయకులు వడ్లమూడి సుబ్బారావు, షేక్ బాజీ షరీఫ్, మల్లికార్జున్, మున్నా రామకృష్ణ, సింహాచలం, బొప్పన భాస్కరరావు, దినేష్, ఆలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మే 1న గుడ్లవల్లేరు మండల పరిషత్ సమావేశం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము ది.01.05.2025 మధ్యాహ్నం 2.00 గం లకు కొడాలి సురేష్, అధ్యక్షులు, మండల ప్రజా పరిషత్ వారి అధ్యక్షతన గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో జరుపబడుతుందని ఎంపిడిఓ టి. విజయసారధి తెలిపారు. ఈ సమావేశమునకు మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయసారధి కోరారు.

# ఐటీసీ, ఈ వేస్ట్‌కి సంబంధించి రీ సస్టెనబులిటీ సంస్థలతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ యంఓయు






**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రస్తుత ప్రభుత్వం ఈజ్ అఫ్ డూయింగ్ బిజినెస్ తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కి కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభి రామ్ అన్నారు. తాడేపల్లిలోని సీడీయంఏ (కమీషనర్ అఫ్ డైరెక్టర్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ) కార్యాలయంలో "సాలిడ్ వేస్ట్" అలాగే "ఈ - వేస్ట్"ప్రాసెస్ మేనేజిమెంట్‌కి సంబంధించి' ఐటీసీ " అలాగే " రీ సస్టెనబులిటీ "సంస్థల యాజమాన్యాలతో స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చేసుకున్న యంఓయు (మెమొరాండం అఫ్ అండర్ స్టాడింగ్) కార్యక్రమంలో స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ పాల్గొన్నారు. వేస్ట్ ప్రాసెసింగ్ మేనేజ్మెంట్ కి సంబంధించి సిద్ధిపేటలో ఐటీసీ కంపెనీ చేస్తున్న ప్రాజెక్ట్ గురించి తెలుసుకుని స్వయంగా అక్కడికి వెళ్లి చూశానని అప్పుడే ఐటీసీ కంపెనీ యాజమాన్యంతో మీ సహకారం మా రాష్ట్రానికి కావాలని అడిగి ఒప్పించడం జరిగిందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్నకుప్పంతో పాటు పిఠాపురం, ఒంగోలు, తిరుపతి,కడప,మంగళగిరి లాంటి 30 యుఎల్బీయస్ ( అండర్ లెవెల్ బాడీస్) అలాగే 5 వేల స్కూల్స్ లలో దశల వారీగా సాలిడ్ వేస్ట్ ని "డబ్ల్యూఓడబ్ల్యూ" (వెల్ బీయింగ్ అవుట్ అఫ్ వేస్ట్) అనే ప్రోగ్రాం ద్వారా చేస్తారని పట్టాభిరామ్ తెలిపారు. వీటికోసం "ఐటీసీ" సంస్థ కొన్ని మార్గ దర్శకలు ఏర్పాటు చేసుకుందని వాటి ద్వారా ఈ ప్రాసెస్ అంతా జరుగుతుందని పట్టాభి రామ్ స్పష్టం చేసారు. ముందుగా కొంతమంది ఎన్జీఓ లని ఏర్పాటు చేసుకుని ఇళ్లలోనే తడి చెత్త ని, పొడి చెత్తని ఏ విధంగా వేరు చేయాలనే అంశం మీద అవగహన కల్పిస్తారని అలాగే వేస్ట్ ని ఎలా కలెక్ట్ చేయాలో ట్రైనింగ్ ఇవ్వడం అలాగే విద్యార్థుల్లో చైతన్యం కలిగే విధంగా ఓరియెంటేషన్ ప్రోగ్రామ్స్ కండక్ట్ చేయడం దానితో పాటు ఎన్జీఓలకి, యుఎల్బీ స్టాఫ్ కి వేస్ట్ ప్రాసెసింగ్ ప్రోగ్రెస్ రివ్యూ చేయడానికి కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంని ఐటీసీ సంస్థ కండక్ట్ చేస్తుందని పట్టాభిరామ్ తెలిపారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటీస్ (యంఆర్ఎఫ్ లు) కార్యకలాపాలకు వివిధ విభాగాల నుండి అవసరమైన అనుమతులు కావలసిన లైసెన్సుల ఏర్పాటు అలాగే స్కూల్స్,కాలేజ్ లలో విద్యార్థులకి అవగహన కల్పించడానికి కావలసిన అనుమతులు అలాగే చెత్త ప్రాసెస్ చేయడానికి అవసరమైన షేడ్స్,బెయిలింగ్ మెషీన్స్,కంపోస్టింగ్ యూనిట్స్, మాన్ పవర్ ఇలా అవసరమైనవాటిని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ తమ వంతు సహకారంగా "ఐటీసీ" సంస్థకి అందిస్తుందని పట్టాభి రామ్ తెలిపారు. ప్రస్తుతం "ఈ - వేస్ట్" కూడా రాష్ట్రం లో ఎక్కువగా జనరేట్ అవుతుందని ప్రపంచ వ్యాప్తంగా "ఈ - వేస్ట్" ఎక్కువగా జనరేట్ అవుతున్న దేశాలలో మన దేశం మూడవ స్థానంలో ఉందని పట్టాభి రామ్ అన్నారు. దేశవ్యాప్తంగా 3.8 మిలియన్ టన్నుల "ఈ వేస్ట్" జనరేట్ అవుతుంటే కేవలం 15 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతుందని పట్టాభి రామ్ అన్నారు. ఈ-వేస్ట్ వలన మనవాళితో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆలా హాని జరగకుండా ఈ - వేస్ట్ ని ప్రాసెస్ చేసే పద్ధతులు ఉన్నాయని పట్టాభి రామ్ తెలిపారు. అందుకోసమే " రెల్డాన్" (రీ - సస్టైనబిలిటీ రెల్డాన్ రిఫైనింగ్) ప్రైవేట్ లిమిటెడ్ లిమిటెడ్ సంస్థతో యంఓ యు చేసుకోవడం జరిగిందని పట్టాభిరామ్ తెలిపారు. ఈ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ-వేస్ట్ రీసైక్లర్ ప్లాంట్ ను హైదరాబాద్‌లో రన్ చేస్తున్నారని స్వయంగా దానిని పరిశీలించడం జరి గిందని పట్టాభి రామ్ తెలిపారు. పైలట్ ప్రైజెక్టు కింద విజయవాడలో ఐదు వేల అడుగుల విస్తీర్ణంలో "ఈ వేస్ట్" సేకరణ కేంద్రం ఏర్పాటు చేయబడు తుందని ఆ తరువాత మిగతా సెంటర్‌లలో కూడా ఈ "ఈ - వేస్ట్" సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పట్టాభి తెలిపారు. "ఈ - వేస్ట్" ని కలెక్ట్ చేయడంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్‌ని ఇన్వాల్వ్ చేసి వారికి ఎంప్లా యిమెంట్ కల్పించే విధంగా తోడ్పాటు ఉంటుందని పట్టాభి రామ్ తెలిపారు. ఆలా కలెక్ట్ చేయడం శాస్త్రీయ పద్దతిలో "ఈ - వేస్ట్" (ఎలక్ట్రానిక్ వేస్ట్) ప్రా సెస్ చేయడం జరుగుతుందని ఇదంతా నేషనల్ అండ్ స్టేట్ "ఈ -వేస్ట్" రెగ్యులేషన్స్‌కి అనుగుణంగానే జరుగుతుందని పట్టాభి రామ్ స్పష్టం చేసారు. మనం అనుకున్న ప్రతిదీ రిజల్ట్ ఓరియంటెడ్‌గా జరిగి తీరాలని లేదంటే రివ్యూలలో కచ్చితంగా సీఎం చంద్ర బాబు అడుగుతారని కాబట్టి మనమంతా ఒక టీంగా ఏర్పడి దీనిని ముందుకు తీసుకువెళ్లాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేష న్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభి రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్ర మంలో సీడీయంఏ కమీషనర్ పి.సంపత్ కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ బి.అనిల్ కుమార్ రెడ్డి, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ భావన, 30 మునిసిపాలిటీలకి సంబంధించిన మునిసిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

## ఎపి ట్రిపుల్ ఐటి అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ క్యాంపస్- ఆర్కే వ్యాలీ ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలులో) 2025-26 విద్యా సంవత్సరానికి గాను 4,400 సీట్లు (రెండేళ్లు పీయూసీ, నాలుగేళ్లు బీటెక్ కోర్సు) ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని గుడ్లవల్లేరు ఎంఇఓ జి.జగన్మోహన రావు తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 27 నుంచి మే 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మెరిట్, రిజర్వేషన్ పాయింట్ల ద్వారా ఎంపికైన విద్యార్థుల జాబితాను జూన్ 5వ తేదీన విడుదల చేస్తారని, అనంతరం జూన్ 11 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మరింత సమాచారం కొరకు https://www.rgukt.in సంప్రదించాలని ఎంఇఓ జి.జగన్మోహనరావు కోరారు.

## చెత్త నుంచి సంపాదన




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో తయారైన వర్మి కంపోస్టును తయారు చేసే అమ్మడం ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకున్నారు. మంగళవారం సర్పంచ్ విజయ్ కుమార్ కార్యదర్శి బి.అనితలు వర్మీ కంపోస్ట్ అమ్మకాలు జరిపారు. అవనిగడ్డ వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు ఈ వర్మి కంపోస్ట్ ను కొనుగోలు చేసి సర్పంచ్ కార్యదర్శులకు నగదును అందజేశారు.

## ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న పంచాయతీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ ప్రధాన రహదారి ఇరువైపులా పేరుకుపోయిన బుసక, మట్టి ప్రమాదాలకు కారణంగా తయారైన మటన్ మంగళవారం పంచాయతీ సిబ్బంది తొల గించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన రహదారికి ఇరువైపులా దుమ్ము ఇసుక పేరుకుపోయి ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారు ఈ తరుణంలో పంచాయతీకి పలువురు సమాచారం ఇవ్వగా ఎట్టకేలకు మంగళవారం ఉదయం పంచాయతీ టాక్టర్ ద్వారా దుమ్ము బుసక తొలగించే కార్యక్రమానికి సర్పంచ్ గోరుముచ్చ ఉమా, పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. పంచాయితీ కార్యాలయం నుండి సీతమ్మ హోటల్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న దుమ్ము బుసకను తొలగించి గుట్టలుగా ఏర్పాటు చేశారు.

## బండి రామకృష్ణకు అభినందనలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా నియమితులైన జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణకు అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్, జనసేన పార్టీ వీర మహిళ బచ్చు కృష్ణకుమారి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఖాళీగా ఉన్న నామిటేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. దానిలో భాగంగా మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణను కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బండి రామకృష్ణకు మంగళవారం కృష్ణకుమారి శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు కొణిదెల పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ కోసం శక్తివంచన లేకుండా రామకృష్ణ కృషి చేశారని ఈ సందర్భంగా కృష్ణకుమారి పేర్కొన్నారు. రామకృష్ణ సేవలను గుర్తించి సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించిన కూటమి ప్రభుత్వానికి కృష్ణకుమారి కృతజ్ఞతలు తెలియజేశారు.

# అవసరమైన పాఠశాలల్లో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్లను నియమించండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉర్దూ ఉపాధ్యాయులుగా వృత్తిలో కొనసాగుతున్న చాలామంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఉర్దూ భాషకు దూరమవుతూ మధ్యలోనే డ్రాప్ ఔట్స్ గా మిగులుతున్నారని కృష్ణా జిల్లా డిఈఓకి సోమవారం వినతి పత్రం సమర్పించి, ఉర్దూ ఉపాధ్యాయులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి పి వీ జే రామారావు ను ఉపాధ్యాయ సంఘులు పి. ఆర్ టి యు. ఎం టి ఏ, ఉర్దూ జేఏసీ పక్షాలు మర్యాదపూర్వకంగా కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాల్లో కొన్ని పాఠశాలలను హైస్కూల్ గా అప్ గ్రేడ్ చేసారు కానీ ఉర్దూ విద్యాభోదన ఇప్పటికీ ఎస్జీటీ ఉర్దూలతోనే కొన సాసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయా పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని వినతి పత్రంలో కోరారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలందు ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో 6 వ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉర్దూ ప్రథమ భాష బోధించుటకు ఉర్దూ ఎస్ ఏ పోస్ట్ ను మంజూరు చేయాలని డిఇఓను కోరారు. ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ మండలాలలో వివిధ పాఠశాలల్లో ఎక్కువమంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఉన్నచోట ఒక ఎస్జీటీ ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. కృష్ణాజిల్లా పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెద్ది బోయిన శ్రీను, మనోహర్, మచిలీపట్నం మండల అధ్యక్షులు రాజు, పెడన మండల శాఖ అధ్యక్షులు పాషా, మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా,యాకుబ్, అలీ, మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అతావుర్ రహమాన్, మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,అబ్దుల్ అతీఫ్, ఉర్దూ జేఏసీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఇర్ఫానుల్లా,రహ మాన్ మస్తాన్, బి,హమీద్, జుబేర్ అహ్మద్, నజీర్ పాల్గొన్నారు.

# ప్రధాని రాక రాష్ట్రానికి ఒక పండుగ



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం నిలిపివేసి, రాష్ట్రాభివృద్ధితో పాటు పరిశ్రమలు రాకుండా చేసిన సైకో అండ్ బ్యాచ్ మరోసారి రాష్ట్ర రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవాలని, రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా కొత్త డ్రామాలు మొదలుపెట్టారు. ఇటీవల ప్రపంచ బ్యాంక్ కి మునిగిపోయే ప్రాంతానికి నిధులు ఇవ్వొద్దంటూ లేటర్ రాశారు. ఇలాంటి సైకో, దుర్మార్గులు, గజదొంగలకి బుద్ధి చెప్పేలా అమరావతి రాజధాని పునర్మిర్మాణ పనుల శంకుస్థాపన కి విచ్చేయచున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి దేశ చరిత్రలో ఇప్పటి వరకు లేని విధంగా ఘన స్వాగతం చేబుదామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. రాష్ట్రానికి మోడీ రాక ఒక పండుగ లాంటిదన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఎమ్.వి.ఆర్ ఫంక్షన్ లో ఎన్డీయే కూటమి నాయకులతో మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ముందుగా నాయకులందరూ కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సభకు ఎమ్మెల్యే వసంతవెంకట కృష్ణ ప్రసాద్ సభాధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తోందన్నారు. పోలవరం, రాజధాని అమరావతి, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు, విశాఖ పరిశ్రమకు ఆర్థిక సాయం, రైల్వే జోన్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులకు పీఎం నరేంద్రమోడి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే, మైలవరం నియోజక వర్గానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఏపీకి ఎంతో మేలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీకి మైలవరం పెట్టనికోటన్నారు. నియోజక వర్గం నుంచి మోడి పర్యటనకు 25 వేల మంది తరలిరావడం ఖాయమని ఎంపీ తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి మోడీకి స్వాగతం పలికేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలి రావటానికి సిద్దంగా వున్నారన్నారు. వీరందరికి కావాల్సిన ఏర్పాట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి చేయటం జరిగిందన్నారు. ప్రధానమంత్రి మోడీ చేతుల మీదగా లక్షల కోట్ల రూపాయల విలువ గల అమరావతి రాజధాని పునర్మిర్మాణ పనులకు శంకుస్థాపన జరగనుందన్నారు.

అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, మే రెండో తేదీన లక్ష కోట్ల రూపాయలతో చేపట్టనున్న అమరావతి రాజధాని పనులకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేతుల మీదుగా శ్రీకారం చుదుతున్నామన్నారు. రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడికి ఘన స్వాగత పలుకుదామని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

శాసనసభ్యులు కృష్ణప్రసాదు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అమరావతిని చంద్రబాబు నాయుడు అకుంఠిత దీక్ష పట్టుదలతో ఒక మహానగరం నిర్మించాలని ప్రయత్నిస్తున్నారు. ఆ మహానగరం భారతదేశంలోనే కాదు ప్రపంచంలోని మహా నగరాల కంటే గొప్ప వుండాలనే సంకల్పంతో సీఎ చంద్రబాబు నాయుడు ముందుకి వెళుతున్నారు. మే2వ తేదీ ప్రధాన మంత్రి మోడీకి రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు వేలాదిగా తరలిరావాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు, మైలవరం నియోజకవర్గ పరిశీలకులు దారునాయక్, కొండపల్లి మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షుడు చిట్టూకుదురు శ్రీనివాసరావు, మైలవరం నియోజకవర్గం బిజెపి ఇన్ చార్జ్ నూతలపాటి బాల కోటేశ్వరరావు, జనసేన నాయకులు చెరుకుపల్లి సురేష్ బాబు,టిడిపి సీనియర్ నాయకులు ఉయ్యూరు వెంకట నరసింహరావు, టిడిపి పార్లమెంటర్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి చెన్నబోయిన చిట్టిబాబు, గొల్లపూడి ఎ.ఎమ్.సి చైర్మన్ నర్రా శ్రీను, ఇబ్రహీంపట్నం మండల పార్టీ అధ్యక్షుడు రామినేని రాజ, జి.కొండూరు మండలపార్టీ అధ్యక్షుడు పజ్జూరి రవికుమార్ (వెంకట్), రెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష కోట్లతో అమరావతి పునర్నిర్మాణం జరగబోతోంది





**నందిగామ, ఏప్రిల్ 29, మేజర్ న్యూస్:** పట్టణం లోని కాకాని నగర్ నందు మంగళవారం నాడు ప్రత్యేక పరిశీలకులు ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు, నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు కూటమి నేతలు అధికారులు మరియు ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారితో కలిసి ఏప్రిల్ 2వ తారీఖున భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ శాఖ మాత్యులు సంజీవరెడ్డి సహిత మాట్లాడుతూ. మే 2 తేదీన ప్రధానమంత్రి కి ఘన స్వాగతం పలుకుదాం. డబుల్ ఇంజన్ సర్కార్ లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరగబోతుంది. గత ప్రభుత్వం అమరావతి రాజధాని అని చెప్పి గెలిచాక రాష్ట్రాన్ని మూడుముక్కల ఆటాడింది. మూడుముక్కల ఆటడిన జగన్ కు ప్రజలు 11 సీట్లతో బుద్ధి చెప్పారు. యువత భవితకు భావితరాల బంగారు భవిష్యత్తుకు సువర్ణ అవకాశమని తెలియజేశారు..



## దివంగత నేత కాగిత వెంకట్రావుకు నివాళులు

**పెడన, మేజర్ న్యూస్:** దివంగత నేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు నాలుగు దశాబ్దాలుగా రాజకీయ నాయకునిగా,నియోజవర్గ ప్రజలకు ఎన్నో సేవలు అందించారని అలాగే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని చిరస్థాయిగా ప్రజల గుండెల్లో ఉండిపోతారని మేమున్నాం సేవా సంస్థ చైర్మన్ వీణం శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు కాగిత వెంకట్రావు నాలుగవ వర్ధంతి సందర్భంగా మేమున్నాం సేవా సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు వ్యక్తులు మాట్లాడుతూ ఆయన నియోజకవర్గానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో పెద తుమ్మిడిలో చలివేంద్రం



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామంలో పంచాయతీ కార్యాలయం సమీపంలో అంబేద్కర్ కూడలి వద్ద బిజెపి నాయకులు మురాల వెంకటేశ్వరరావు, గుమ్మిడి రాజు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం బంటుమిల్లి మండలంబిజెపి పార్టీ అధ్యక్షులు జల్లూరి కిరణ్ గుప్తా చేతుల మీదగా ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెదతుమ్మిడి లో మురాల వెంకటేశ్వరావు చలివేంద్రం ఏర్పాటు చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో హర్షనీయం అని పలువురు గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మురాల వెంకటేశ్వర రావు, గుమ్మడి రాజు కరెంటు రాజుగారు, ఏకుల బాలాజీ, కార్యకర్తలు పార్టీ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం



**జి.కొండూరు మేయర్ న్యూస్ :** 2024-25 విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థినికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు నగదు ప్రోత్సాహం అందజేసి అభినందించారు. కొండపల్లిలో ప్రభుత్వ బాలికల పాఠశాలలో టెన్త్ చదివిన దేవరకొండ జ్యోత్స్న 581 మార్కులు సాధించి ఇబ్రహీంపట్నం మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇబ్రహీంపట్నంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ని విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు మంగళవారం ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు విద్యార్థినిని అభినందిస్తూ పదో తరగతిలోనే కాకుండా ఇంటర్మీడియట్లో కూడా మంచి మార్కులు సాధించాలని అన్నారు. అత్యధికంగా మార్కులు సాధించిన జ్యోత్స్నకు రూ.15 వేలను అందించారు. ఉన్నత చదువులకు కూడా తన సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ శివనాథ్ (చిన్ని), అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తదితరులు ఉన్నారు.

34

విద్యార్థిని ఉన్నత విద్యకు ‘ మైత్రి ‘ చేయూత.

మచిలీపట్నం మేజర్ న్యూస్ : మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పేద విద్యార్థినికి 28,500 రూపాయల ఆర్థిక సాయం అందించి మరోమారు పెద్దమనసు చాటారు. స్థానిక భాస్కరపురం ప్రాంతానికి చెందిన నాంపల్లి విజయ్ కుమార్,వాహిని దంపతుల కుమార్తె మహాలక్ష్మి ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 950 మార్కులు సాధించింది. సి.ఏ చదవాలనే తన కలను సాకారం చేసుకోవాలని, ఆర్థిక సాయం కోసం దాతల సహకారం కై ఎదురుచూస్తూ విదేశాలలో ఉన్న మైత్రీ ఫౌండేషన్ గౌరవ సభ్యులు చదలవాడ దివాకర్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి పేద విద్యార్థినిని, గుంటూరు మాస్టర్ మైండ్స్అకాడమీ లో చేరుటకుగాను 28,500/- రూపాయలు ఆర్థిక సాయం చేయమని కోరగా సోమవారం చెక్ ద్వారా ఆ విద్యార్థినికి మైత్రి ఫౌండేషన్ సభ్యులు అందించడం జరిగింది. విద్యార్థి తల్లిదండ్రులు దాత చదలవాడ దివాకర్ కి, మైత్రి ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వేణుకుమార్, వరప్రసాద్, ప్రసాద్, రాధా కృష్ణ, దీప్తి, కనకరాజులు పాల్గొన్నారు.

# మే 15 నుండి కన్నుల పండువగా బీచ్ ఫెస్టివల్

### మంగినపూడిని పర్యాటక హబ్‌గా చేస్తాం

### బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఘనమైన బందరు చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించే విధంగా మంగినపూడి బీచ్ ఉత్సవాలను ఎంతో గొప్పగా నిర్వహిస్తామని, మంగన పూడి బీచ్ను అన్ని విధాల అభివృద్ధి పరిచి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొ న్నారు. మంగళవారం ఉదయం మంత్రివర్యులు సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మంగినపూడి బీచ్‌ను సందర్శించారు. వచ్చే మే నెలలో నిర్వహించనున్న బీచ్ ఉత్సవాల నేపథ్యంలో రేఖా చిత్రపటం పరిశీలించి అక్కడ చేపట్ట వలసిన పనులు, ఏర్పాట్ల గురించి మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మన రాష్ట్రానికి 980 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉందని, మంగినపూడి బీచ్ పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా హైదరాబాదుకు మంగినపూడి బీచ్ చాలా దగ్గరలో ఉందన్నారు. బీచ్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు. ఇందుకోసం బీచ్ లో 150 ఎకరాలను గుర్తించామని, ఇంకనూ మరో 200 నుంచి 300 ఎకరాలు కూడా గుర్తించే పనులు జరుగుతున్నాయని, అక్కడ కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ నిధులతో రిసార్టు, హోటళ్ల కోసం స్థలాలు కూడా కేటాయిస్తామన్నారు. తద్వారా 1000 నుంచి 1500 కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయన్నారు. తమ ప్రభుత్వం 2018లో మంగినపూడి బీచ్ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించిందని, సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడలు ప్రదర్శనశాలలు బ్రహ్మాండంగా ఏర్పాటు చేశామన్నారు. బీచ్ కు పూర్వవైభవం తీసుకొచ్చి ఈసారి ఉత్సవాలను అందరినీ ఆకట్టుకునే విధంగా మరింత ఘనంగా నిర్వహించి ప్రజలకు కొత్త అనుభూతిని కల్పిస్తామన్నారు. ఈసారి ఉత్సవాలలో జాతీయ క్రీడలు కయా కింగ్, బీచ్ కబడి పోటీలు నిర్వహించేందుకు అనుమతి వచ్చిందన్నారు. ఈ వేసవికాలంలో వచ్చే మే నెల 15వ తేదీ నుండి3 రోజుల పాటు విద్యార్థులకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం లో ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మెప్మా పిడి సాయిబాబా, రహదారులు భవనాల డి ఈ సంగీత, తహసిల్దారు నాగభూషణం, మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జగదీష్ చంద్రబో స్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# గుల్లలమోద క్షిపణి కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** డి ఆర్ డి ఓ కేంద్రం జిల్లాలోని గుల్లలమోదలో ఏర్పాటు కావడం జిల్లాకే కాకుండా రాష్ట్రానికే గర్వకారణమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నాగాయలంక మండలంలోని గుల్లల మోద డి ఆర్ డి ఓ క్షిపణి పరీక్ష కేంద్రంలో జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావుతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ప్రధానమంత్రిచే ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం వీక్షణకు అవసరమైన ఏర్పాట్లు పాటించవలసిన భద్రత ప్రమాణాలు గురించి వారు అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వచ్చే మే నెల 2 వ తేదీన భారత ప్రధానమంత్రి అమరావతి రాజధాని నిర్మాణ పనులు పునః ప్రారంభించేందుకు వస్తున్నారన్నారు. అందులో భాగంగా గుల్లల మోద లోని డిఆర్డిఓ కేంద్రాన్ని వర్చువల్ గా ప్రధానమంత్రి ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ముందస్తుగా ఏర్పాటు చేస్తున్నామని ఆ కార్యక్రమం స్థానిక ప్రజలు చూసే విధంగా ముందస్తుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధికారికంగా సమాచారం అందాల్సి ఉందనీ అది అందాక ఏర్పాట్లు పూర్తిగా చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంతో ప్రతిష్టాత్మక మైన డి ఆర్ డి ఓ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించడం రాబోవు రోజుల్లో జిల్లాకు ఒక గొప్ప వరమన్నారు. ఇక్కడ జరిగే కార్యక్రమానికి వచ్చే ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తామన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ ఎస్పీ వెంట డిఆర్‌డిఓ కల్నల్ సమీర్, మచిలీ పట్నం ఆర్డిఓ స్వాతి, అవని గడ్డ డిఎస్పి టి.విద్య శ్రీ, తహసిల్దారు హరినాథ్, ఏ డి ఐఓలు ఫణి కుమార్, సెల్వినా అధికారులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణ, పట్టుదలకు వైభవ్ సూర్య వంశీ ప్రతిరూపం

### యువ క్రికెటర్లకు ఆదర్శం

### ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ, మేజర్ న్యూస్ :** 14 ఏళ్ల వయస్సులో ఐపీఎల్ లో క్రికెట్ ఆడటమే కేవలం 35 బంతుల్లో సెంచరీ సాధించి అరుదైన రికార్డ్ క్రియేట్ చేసిన యువక్రికెటర్ వైభవ్ సూర్యవంశీ పై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నీ) హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా యంగ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ప్రతిభను ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశంసించారు. అతి చిన్న వయస్సులోనే దేశ వ్యాప్తంగా మాత్రమే కాక ప్రపంచ స్థాయిలో వైభవ్ సూర్య వంశీ గుర్తింపు సాధించటంతో చాలా ఆనందంగా వుందన్నారు. వైభవ్ సూర్యవంశీ చక్కటి ప్రతిభ కనబర్చారని కొనియాడారు. మంచి భవిష్యత్తు వుంటుందని, మరెన్నో రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఎపి నుంచి ఇలాంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను వెలికి తీసేందుకు ఏసీఏ కృషి చేస్తుందని తెలిపారు. వైభవ్ సాధించిన సెంచరీ ఆయన క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదలకి నిదర్శనమని కొనియాడారు. యువ క్రికెటర్లు సూర్య వంశీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా రామవరప్పాడు రింగ్, బెంజ్ సర్కిల్, నోవోటల్, కృష్ణలంక హైవే, విద్యాధరపురం ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని ఎప్పటికప్పుడు వ్యర్థాలను తీసివేయాలని నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యక్రమానికి పారిశుధ్య నిర్వహణకు ఇతర మున్సిపాలిటీ నుండి కార్మికులకు వసతి లో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజనని ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ కమిషనర్ హెలెన్, సానిటరీ సూపర్వైజర్ శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.




18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999